## క్లుప్తంగా

### వదలని వర్షం.. రైతుల్లో కలవరం

పెరవలి: అకాల వర్షాలు రైతులను భయపెడుతున్నాయి. ఆదివారం చినుకులు పడితే సోమవారం ఉదయం వర్షం కురవడంతో రైతులు కంగారు పడ్డారు. రాశులుగా ఉన్నా ధాన్యం తడిసి నష్టం వస్తుందేమోనని ఆందోళన చెందారు. సోమవారం అరగంట పాటు వర్షం కురిసింది. అనంతరం ఎండ కాయటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో 8,500 ఎకరాల్లో రబీ వరిసాగు చేయగా ఇప్పటి వరకూ సుమారు మూడు వేల ఎకరాల్లో మాత్రమే మాసూళ్లు జరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి వరికోత యంత్రాలను తీసుకువచ్చి అధిక ధరలు ఇచ్చి మాసూళ్ళు చేస్తున్నారు.

**చాగల్లు మండలంలో..**

చాగల్లు: మండలంలో సోమవారం ఉదయం కూడా చిరు జల్లులు పడడంతో రైతులు ఆందోళన చెందారు. రబీ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు రోడ్లపైనే ఆరబెడుతున్నారు. చాగల్లు, ఊనగట్ల, ఎస్.ముప్పవరం తదితర గ్రామాల్లో ప్రధాన రోడ్లపైనే ధాన్యాన్ని ఎండబెడుతున్నారు.

### గోపవరంలో మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఈబీ సీఐ సుధ, సిబ్బంది

దేవరపల్లి: స్థానిక ఎస్ఈబీ పోలీసులు ఆదివారం గోపాలపురం మండలం గోపవరం గ్రామంలోని ఓ ఇంటిపై దాడి చేశారు. ఆ గ్రామంలోని సోసిపును ప్రసాద్ వద్ద నుంచి సుంకం చెల్లించని ఐఎంఎల్ 111 సీసాలు, బీర్ సీసాలు 72 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ దిమ్మల సుధ సోమవారం తెలిపారు. పెనుగొండ మండలం చినమల్లం గ్రామానికి చెందిన గూడాల చంద్రశేఖర్ స్వామి అనే వ్యక్తి ప్రసాద్‌కు ఈ మద్యం సీసాలను సరఫరా చేసినట్టు ఆమె చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై పి. సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

**దొమ్మేరులో ఇద్దరి అరెస్టు**

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురిని సోమవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. బండ్రెడ్డి శేషగిరిరావు అనే వ్యక్తి వద్ద నుంచి ఆరు మద్యం క్వార్టర్ బాటిళ్లను, బండ్రెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద నుంచి 29 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేశామని, కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. ఎస్సై జి.బసంతి, ఇతర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

### 1న కొవ్వూరులో కరాటే బెల్ట్ టెస్టులు

కొవ్వూరు: పట్టణంలోని ఎచీవర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో మే1న కరాటే బెల్టు టెస్టులు నిర్వహిస్తున్నట్లు కరాటే శిక్షకురాలు, బ్లాక్ బెల్ట్ ఫోర్త్ డాన్ ఆకుల రాధ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ టెస్టులు నిర్వహిస్తామన్నారు. కరాటే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ బడులకు రక్షణ

- జెడ్పీ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్
- నియామకాలకు జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



ఊనగట్లలో హైస్కూల్లో బీరువాలు పగలగొట్టి వస్తువులు దొంగలించిన దృశ్యం (ఫైల్)

చాగల్లు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మే 1 నుంచి వాచ్‌మెన్ బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. జెడ్పీ హైస్కూళ్లకు ఏళ్ల తరబడి నైట్ వాచ్‌మెన్ లేరు. దీంతో పలు హైస్కూళ్లలో ఎన్నోసార్లు చోరీలు జరిగాయి. కంప్యూటర్లు, ఇతర విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయి. సరస్వతీ నిలయాలైన పాఠశాలల గదులు రాత్రిపూట మందుబాబులు, జూదరుల అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. మద్యం మత్తులో ఆకతాయిలు ఆస్తులను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇవే గాకుండా పశువులు పాఠశాలల ఆవరణల్లోకి చొరబడి నీడనిచ్చే మొక్కలను, పచ్చదనాన్ని ధ్వంసం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి మౌనంగా భరించారు. సెలవు రోజుల్లో సైతం హైస్కూళ్లకు వచ్చి పరిస్థితి గమనించి వెళ్లే హెచ్ఎంలు చాలా మందే ఉన్నారు.

**చాగల్లు మండలంలో....**

- మండలంలోని మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుసార్లు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి విలువైన వస్తువులు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు అపహరించుకుపోయారు.
- ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండుసార్లు దుండగులు ప్రవేశించి కంప్యూటర్ ల్యాబ్‌లోని కంప్యూటర్‌లు, ఆఫీస్ రూమ్ బీరువాలోని వస్తువులను దొంగలించుకుపోయారు.
- చిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫర్నిచర్, వంట పాత్రలు అపహరించుకుపోయారు.

| మండలం | హైస్కూళ్ల సంఖ్య |
|---|---|
| చాగల్లు | 7 |
| కొవ్వూరు | 9 |
| తాళ్లపూడి | 7 |

**స్థానికులకే ప్రాధాన్యం**

జెడ్పీ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్ నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హెచ్‌ఎంలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.6,000 గౌరవ వేతనంపై నియమించే వాచ్‌మన్ పోస్టు భర్తీలో అదే హైస్కూల్లో పనిచేసే ఆయా భర్తకు గానీ, వంట చేసే మహిళ భర్తకు గానీ తొలి ప్రాధాన్యం ఇస్తారు. లేకుంటే 60 ఏళ్ల లోపు వయసున్న స్థానిక ఎక్స్ సర్వీస్‌మన్ గానీ, లేకుంటే పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని గాని నియమించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ షరతుల ప్రకారం హెచ్‌ఎంలు ప్రస్తుతం తమ హైస్కూళ్లకు నమ్మకంగా పనిచేసే వాచ్‌మన్‌ను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.

**ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం**



జెడ్పీ హైస్కూళ్ల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. గతంలో పలు మార్లు ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. మే 1 నుంచి వాచ్‌మెన్ బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నాం.
– టీఎస్ రామానుజం, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, ఊనగట్ల, చాగల్లు మండలం

### 27న మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: కొవ్వూరు పురపాలక సంఘ పాలక వర్గ సాధారణ సమావేశాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్ పర్సన్ భావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు చెప్పారు. సభ్యులందరూ విధిగా హాజరు కావాలని కోరారు.

### సత్యసాయిబాబా ఆరాధనోత్సవం

నల్లజర్ల: సత్య సాయిబాబా 12వ ఆరాధనోత్సవాన్ని సోమవారం అనంతపల్లిలో నిర్వహించారు. కన్వీనర్ మంచిరాజు రాజగోపాల భుజంగరావు ఆధ్వర్యంలో ఉదయం నగర సంకీర్తన, రాత్రి 3 గంటల పాటు నామ సంకీర్తన, ప్రసాద వితరణ జరిగాయి. సేవాదళ్ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### శాఖా గ్రంథాలయం ఆధునీకరణ




ఆధునీకరించిన అంబేద్కర్ శాఖా గ్రంథాలయ భవనం

నల్లజర్ల: స్థానిక బీఆర్ అంబేద్కర్ శాఖా గ్రంథాలయాన్ని దాదాపు రూ.50 వేల వ్యయంతో ఆ గ్రామ అంబేద్కర్ యూత్ ఆధునీకరించింది. యూత్ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాసరావు మాట్లాడుతూ 'నేను విగ్రహాల్లో లేను..పుస్తకాల్లో ఉన్నాను' అన్న అంబేద్కర్ వాక్కులకు అనుగుణంగా తమ యూత్ సభ్యులు ఈ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. నల్లజర్ల సర్పంచ్ జ్యోతి సుబ్బారావు ఆర్థిక సాయంతో విరిగిపోయిన కుర్చీలకు మరమ్మతులు చేయించామని, భవనానికి పెయింటింగ్ వేయించామని చెప్పారు.

## ఐ.పంగిడిలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: 12వ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో ప్రారంభించారు. అనంతరం మంత్రి క్రికెట్ బ్యాట్ పట్టుకుని సరదాగా కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకుని 'బెస్ ఆఫ్ లక్ ' చెప్పారు. ఇటీవల మృతి చెందిన మాజీ ఉప సర్పంచ్ తోట దుర్గారావు, కోమటి సతీష్‌ల స్మారకార్థం ఈ ఏడాది టోర్నమెంటు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులైన వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, రాసపోతు నారాయణ, పాపోలు సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, సర్పంచ్ గోశాల నాగర్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి నానాజీ, టీడీపీ నాయకుడు పొట్రు సిద్ధూ, కోమటి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మలేరియాపై ప్రజలకు అవగాహన



మలేరియాపై అవగాహన ర్యాలీ చేపడుతున్న వైద్యాధికారి గంగాధరరావు, సిబ్బంది

నల్లజర్ల: మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, వ్యాధి నివారణకు కృషి చేద్దామంటూ నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు సీహెచ్ గంగాధరావు వైద్య,ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ అంశంపై సోమవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధి నిర్మూలనకు కీటక నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చంద్రశేఖరరాజు, పీహెచ్ఎన్ రాధాకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు అన్నమ్మ, సత్యనారాయణ, ఆరోగ్య సహాయకులు జీవీవీ ప్రసాద్, వీరరాఘవేంద్రరావు, కె.సుబ్బారావు, గ్రామారోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా

**కాపవరం సొసైటీ చైర్మన్‌గా 'సుంకర '**



సుంకర సత్యనారాయణ, సర్పంచ్ పద్మిని దంపతులకు సత్కారం

కొవ్వూరు: రైతులకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి పాటు పడతానని మండలంలోని కాపవరం సొసైటీ త్రీ మెన్ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ అన్నారు. కాపవరం సొసైటీ అధ్యక్షుడిగా ఆ సొసైటీ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. రబీ ధాన్యాన్ని విక్రయించే విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా, రైతులు తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కొందరు మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. గతేడాది రూ.40 లక్షల వ్యయంతో సొసైటీకి నూతన గోదాం నిర్మించుకున్నామని, ఈ ఏడాది ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ, ఆయన భార్య, కాపవరం సర్పంచ్ సుంకర పద్మినిలను ఘనంగా సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోట రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు ఎలుబండి సురేష్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అమానుల్లాబేగ్, ఉప సర్పంచ్ గోతం మేరీ ఝాన్సీ, సొసైటీ కార్యదర్శి చొటుపల్లి కృష్ణ, మాజీ కార్యదర్శి చొటుపల్లి వెంకట్రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### నేటి నుంచి శంకర జయంత్యుత్సవాలు

కొవ్వూరు: ఈ నెల 25 నుంచి 29 వరకూ స్థానిక గౌతమీనగర్‌లో శంకర జయంతి మహోత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు సోమవారం తెలిపారు. రోజూ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకూ నోరి భోగేశ్వరశర్మ సోమయాజి బ్రహ్మసూత్ర శంకర భాష్య పఠనం చేస్తారన్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి మల్లాది కళ్యాణ్ కుమార్ సౌందర్య లహరి పారాయణ, అనంతరం గోరిగంతు భాస్కర వెంకట సుబ్రహ్మణ్యంచే శంకర విజయంపై ప్రవచనం ఉంటుందన్నారు.

దేవరపల్లి: స్థానిక సద్గురు ఆదిశంకరాచార్యుల ధ్యాన మందిరం వద్ద మంగళవారం గురుదేవుల జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం పూజలు, అనంతరం 11 గంటల నుంచి అన్నసమారాధన జరుగుతుందన్నారు.

## అట్టహాసంగా మోదుగులమ్మ జాతర



అమ్మవారి గ్రామ సేవలో విచిత్ర వేషధారణలు



హోం మంత్రి తానేటి వనితకు సత్కారం

తాళ్లపూడి: గ్రామదేవత మోదులమ్మ వారి జాతరతో తాళ్లపూడి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఆదివారం రాత్రి మొదలైన అమ్మవారి గ్రామ సేవ సోమవారం ఉదయం వరకూ శోభాయమానంగా సాగింది. జాతర సందర్భంగా గ్రామంలో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. గ్రామ సేవలో భాగంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలతో పాటు అఘోరా, కాంతారా ట్రూప్, కోయ నృత్యాలు, బుట్టబొమ్మలు ఆకట్టుకున్నాయి. కేరళ, తీన్మార్ వాయిద్యాలు వీనుల విందుగా సాగాయి. భారీఎత్తున బాణసంచా కాల్చారు. తాళ్లపూడి ప్రధాన వీధుల గుండా మోదులమ్మ వారి గ్రామసేవ సాగింది. వీధులన్నీ జనంతో కిక్కిరిసాయి. సినీ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు. హోం మంత్రి తానేటి వనిత మోదులమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, నక్కా చిట్టిబాబు, జడ్డు శ్రీను, గుండుబోగుల ప్రసాద్, బండారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు



ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

- పీపుల్స్ సర్వేలో స్పష్టం
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న సంక్షేమ పాలనకే ప్రజలు మద్దతు ఇస్తున్నట్టు పీపుల్స్ సర్వేలో స్పష్టమైందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కోటి గృహాల సందర్శన పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన నిడదవోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరికీ వివరించే లక్ష్యంతో ఈనెల 7న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో 90,795 కుటుంబాలు ఉండగా ఇప్పటికే 54,208 గృహాలను వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సందర్శించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారన్నారు. ఈ పీపుల్స్ సర్వేకు ప్రజల నుంచి అనూహ్య మద్దతు వస్తోందని ఎమ్మెల్యే అన్నారు. తమకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండి మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని శ్రీనివాస్ నాయుడు కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పెరవలి జెడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 12 మందిపై పిచ్చికుక్కల దాడి

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. స్థానిక రాయిపేట, కోటశక్తి నగర్‌లో ఆది, సోమవారాల్లో 12 మందిని కరిచి, గాయపరిచాయి. దాంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టారు. కుక్కకాటు బాధితులకు నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో ర్యాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీఆర్ఎస్ తాతారావు తెలిపారు.

### ఉండ్రాజవరంలో చలివేంద్రం

ఉండ్రాజవరం: ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్థానిక ఎస్సై కె.రామారావు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. దాతల సహకారంతో వేసవి ముగిసే వరకూ ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తామని ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

### నేడు మండల పరిషత్ సమావేశం

దేవరపల్లి: దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ దుర్గారావు అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు.

# సమష్టి కృషితో పల్లెల అభివృద్ధి సాధ్యం

- డీఎల్‌డీవో శాంతమణి
- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
- ఉత్తమ పంచాయతీలకు అవార్డుల ప్రదానం



కొవ్వూరులో ఎంపీపీ కాకర్ల, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి చేతుల మీదుగా సన్మానం



దేవరపల్లిలో సర్పంచ్ కె.పరమేశ్వరరావుకు సన్మానం



తాళ్లపూడిలో సర్పంచులకు సత్కారం



పెరవలి మండలంలోని ఉత్తమ పంచాయతీల సర్పంచులతో ఎంపీపీ ప్రసాద్

కొవ్వూరు: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి శాంతమణి అన్నారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. చైల్డ్ అండ్ ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా దొమ్మేరు, వాటర్ సఫిషియెంట్ క్లీన్ అండ్ గ్రీన్,పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్‌లో ఆరికిరేవుల, సెల్ఫ్ సఫిషియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో తోగుమ్మి, పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల కల్పనలో నందమూరు, సోషియల్లీ సెక్యూర్డ్ పంచాయతీగా పశివేదల అవార్డులు దక్కించుకున్నాయి. మొత్తం మీద తొమ్మిది అంశాల్లో మూడు అంశాల్లో మొదటి స్థానం సాధించి ఆరికిరేవుల పంచాయతీ మొదటి వరుసలో నిలిచింది. ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్, ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ అధ్యక్షతన నిర్వహించారు. అవార్డులు పొందిన బందపురం, చిన్నాయగూడెం, దుమంతునిగూడెం, దేవరపల్లి, గౌరీపట్నం, సంగాయగూడెం, త్యాజంపూడి పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులను మండల పరిషత్ ద్వారా సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: పల్లెల పురోభివృద్ధే దేశ ప్రగతికి సోపానం అని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 11 పంచాయతీల సర్పంచ్‌లను ఎంపీపీ పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీడీవో రాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సర్పంచులు కొమ్మిరెడ్డి పరశురామారావు, నమా శ్రీనివాస్, గండి రాంబాబు, ఎల్లిన శివ, యాళ్ల స్వప్న, తిగిరిపల్లి వెంకటరావు, ఎలిపే సుధారాణి, రాపాక రాజేశ్వరులు తదితరులు సన్మాన గ్రహీతల్లో ఉన్నారు.

ఉండ్రాజవరం: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారం అవుతోందని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఆమె అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు మాట్లాడుతూ సర్పంచులు, కార్యదర్శుల భాగస్వామ్యంతో పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం వివిధ పంచాయతీల సర్పంచులను, కార్యదర్శులను ఎంపీపీ యల్లారేశ్వరి, ఎంపీడీఓ ఎ శ్రీనివాసులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. దమ్మెన్ను గ్రామంలో పారిశుధ్య కార్మికులను సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గెద్దం రామకృష్ణ సత్కరించారు.

పెరవలి: కేంద్ర ప్రభుత్వం ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసిన తొమ్మిది మంది పంచాయతీ సర్పంచులపై బాధ్యత మరింత పెరిగిందని అందుకనుగుణంగా మరింతగా రాణించాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. మండలం నుంచి తొమ్మిది ఉత్తమ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కాకరపర్రు, కానూరు, తీపర్రు, ఉసులుమర్రు, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, నడుపల్లి పంచాయతీల సర్పంచులను, కార్యదర్శులను ఘనంగా సన్మానించి, అవార్డులు అందించారు. ఎంపీడీఓ ఎస్. రమేష్, ఈఓపీఆర్‌డీ నరసింహమూర్తి తదితరులు హాజరయ్యారు.

చాగల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చాగల్లు సభలో సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.అర్జునుడు పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. బ్రాహ్మణగూడెంలో సర్పంచ్ జి.కుమారి, ఊనగట్లలో సర్పంచ్ మట్టా వెంకట్రావు అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి.

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎంపీడీఓ టి.మూర్తిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబులు మండలంలోని ఉత్తమ సర్పంచులు కారింకి అన్నవరం (పెండ్యాల), నేలపూడి నాగమణి (పురుషోత్తపల్లి), గుత్తుల నాగలక్ష్మి (కోరుపల్లి), బయ్యే రాధారాణి (తాడిమళ్ల), దేశాబత్తుల జోత్స్న ప్రియాంక (సమిశ్రగూడెం), ముప్పిడి చంద్రశేఖర్ (తిమ్మరాజుపాలెం), తిక్కా శ్రీనివాస్ (విజ్జేశ్వరం), నాగిరెడ్డి నాగదేవి (డి.ముప్పవరం), జడ్డు శ్రీలక్ష్మి (శెట్టిపేట), అంబటి గోపమ్మ (కోరుమామిడి), కె.వెంకటేశ్వరరావు (కాటకోటేశ్వరం), కార్యదర్శులకు ఘనంగా సన్మానించారు.